# 'గోలీ సోడా... జీవితం'

'సోడా సోడా ఆంధ్రా సోడా...' పాట ఏదో సినిమాలో ఓ కమేడియన్ పాటగా గుర్తుంది. చలమనుకుంటా ఆ కమేడియన్....!

ఎండాకాలం మొచ్చేసింది.

మనకు మూడు కాలాలన్డం శుద్ధాబద్ధం. ముఖ్యంగా రాయలసీమ వాసులకు... రెండే రెండు కాలాలు...

ఓటి చలికాలం... ఓ నెలాన్నర.

ఇంకోటి ఎండాకాలం పదిన్నర పదకొణ్ణెలలూ... అంతే.

బంగాళాఖాతంలోనో ఎక్కడో అల్పడీనమో... వాయుగుండమో వస్తేగిస్తే వర్షాలు అంతే.

ఈ పదకొణ్ణెలల ఎండాకాలానికీ, మా గోలీసోడాకీ ఓ లింకు...

సాయంకాలం ఆరున్నరేడు నుంచీ ఎనిమిదిన్నర తొమ్మిది వరకూ ఎక్కడో వక వీధిలో సోడాకాయి పగిలి 'కీ'మన్న చప్పుడు వినబడుతుంది.

మొన్న నా మధ్య మా రంగూన్‌రెడ్డిగాడు యూకేనించీ వచ్చినప్పుడు చెప్పాడు అక్కడ మ్యూజియంలో గోలీసోడా సీసా వుందిట.

మనకేమో యిక్కడ యింకా గోలీసోడాకాయిలు తలలు తెంచుకుంటూనే వున్నాయి. ఎన్ని కోక్‌లూ, పెప్సీలూ యింకా రంగురంగుల డ్రింకులూ వచ్చిన నిమ్మకాయ సోడా మజానే వేరు... తాగింతర్వాత 'బ(రున' తేన్పడం ఓ హాయి... సోడాలకు ప్రత్యేకం మా కర్నూల్లో నెల్లూరు బళ్ళు...

నెల్లూరునించీ వలస వచ్చిన వాళ్లు యిక్కడ చాలామందున్నారు...

వాళ్ళల్లో చాలామంది సోడాబళ్ళతో వ్యాపారం చేస్తారు.

ఓ దీర్ఘచతురస్రాకారపు బండీ, అందులో సోడా సీసాలు పట్టేవిధంగా చెక్క అరలు.. వాటిల్లో తిప్పేసి పెట్టిన సోడా సీసాలూ. వాటి మీద ఓ గోనెసంచి పరచివుంటుంది. అది తోపుడుబండీ... బండికింద బకెట్ వేల్లాడ్తోంటుంది... అందులో నీళ్ళుంటాయి.

సోడా అమ్మే అతను మాటిమాటికీ ఆ బకెట్లో నీళ్ళను చేత్తో ఆ గోనె మీద

చిలకరించి చల్లబరుస్తుంటాడు. (పేదవాళ్ల రెఫ్రిజిరేషన్ మరి)... అతను అరిచే అరుపు కూడా ప్రత్యేకం...

'సో'కు ఓ అయిదారు 'స' వత్తులిచ్చి... 'డ'కు అతిపొడువు దీర్ఘమిచ్చి చివర్న 'య్' కలిపి అరుస్తాడు. వెరసి ఇట్లా వుంటుందీ అరుపు..

'స్స్స్స్ సో ... డా ఆఆఆ..య్య్ య్యే.'

నెలాఖర్న... అరువు వాడి ప్రత్యేకత...

సోడాబళ్లు నడిపే నెల్లూరు వాళ్ళు చాలామంది లక్షాధికారులైపోయారు. అది వేరే విషయం. సోడా అంటే మా కర్నూలు 'పఠాన్ సోడా,' 'ఈశ్వర్ సోడా' గురించే చెప్పుకోవాలి. మేం డిగ్రీ చదివేరకూ అవి చాలా ఫేమస్... అంటే ఓ దాదాపు ముప్పై ఏళ్ళ క్రితం వరకూ నన్నమాట. ఈరోజుకీ వున్నాయి ఆ సోడా కొట్లు. కానీ ఆ వైభవం లేదు. అప్పట్లో అటు విక్టరీ సినిమా హాలూ యిటు రాధాకృష్ణా సినిమా హాలూ... ఇరుకు రోడ్లు దగ్గరగా బస్టాండు.

ఆ అంగళ్ళకి అతిదగ్గరగా బంగారంగళ్ళూ బట్టలంగళ్ళూ...

సాయంకాలం ఆరు... అయ్యిందంటే చాలు..

పఠాన్ ఈశ్వర్ల పోటీ సోడా 'కుయ్యి'లు.

చెక్కసోడా ఓపనర్ కింద ఓ సైకిలు ట్యూబు ముక్కనుంచీ... దాంతో సోడా సీసా లోపలి గోలీని వత్తి చినచిన్నగా దాన్నొదుల్తూ పఠాన్‌వాడు అరనిముషం 'కుయ్' మనిపిస్తే ఈశ్వర్ వాడు నిముషం. దాంతర్వాత పఠాన్‌వాడు నిముషంకంటే ఎక్కువ... అక్కడ జనాలు ఆ పోటీ చూట్టానికే అన్నట్టు మూగేవారు... అసలే యిరుకు రోడ్డు... అటు వేపో సినెమా యిటువేపో సినెమా... పక్కనే బస్టాండు.

ఈ సోడా అంగళ్ళ పక్కకి స్టార్ టీ హోటలుండేది...వాడి దగ్గర ఓ గ్రామ ఫోనుండేది...వాడి రికార్డు కలెక్షను వీఏకే. రంగారావుగారికి పోటీ అన్నట్లుండేది...టీ తాగడం ఓ సాకు మాత్రమే. టీ బిల్లుకూ యింకో పదిపైసాలిస్తే మనమడిగిన రికార్డు వేస్తాడు. దానికీ ఓ 'క్యూ'. పంకజ్ మల్లిక్ ఎస్డీ బర్మన్ సైగల్ పాటల్దగ్గర్నించీ పాటలడిగే వాళ్ళుండే వాళ్ళు... అప్పుడందరిళ్ళల్లో యిప్పట్లా టూయిన్ వన్లూ త్రీయిన్ వన్లూ లేవు కదండీ... ఇప్పుడు కాసెట్ల నించీ సీడీలకి మారిపోయింది.

సరే సోడా గురించి కదండీ మనం మాట్లాడుకుంటున్నది.

మరీ చిన్నప్పుడు గోలీలాటలో సోడా గోలీకి ప్రత్యేక స్థానముండేది.

మాకు సోడా రాముడని ఒకడుండేవాడు... వట్టి సోడా మాత్రమే కాదు మధ్యాహ్నాల

పూట స్కూళ్ళ దగ్గర అయిసమ్మేవాడు...పెద్ద అయిసు దిమ్మతెచ్చి ఓ చిత్రికతో (ఇక్కడ తోప్‌డా అంటారు మా కర్నూల్లో) దాన్ని తురిమి ఓ ఆకుదొన్నెలో వేసి దానిమీద రంగు చక్కెర పాకం చల్లి ఓ చెక్క స్పూన్తో ఇచ్చేవాడు... అయినా అతన్ని సోడా రాముడని పిలిచేవాళ్ళం.

మారంగున్‌రెడ్డిగాడు యూకే నించి వచ్చినపుడు అరేయ్... సోడా రాముడిని కలుద్దాంరా అన్నాడు.. వెళ్ళాం.. అక్కడ ఓ ముప్పయ్యేళ్ళ వ్యక్తి సోడా తిప్పుతున్నాడు మిషన్లో. కాస్త సందేహిస్తూనే.. 'రాముడూ...?' అన్నాడు మా రంగూన్ రెడ్డి...

'నాయన సోడా సీసాలు పగిలి సచ్చిపోయ సారూ...' అన్నాడతను.

జీర్ణించుకోడం కొద్దిగా కష్టంగా అనిపించింది. దీన్నే ఇంగ్లీషులో 'ప్రొఫెషనల్ హజార్డ్' అంటారు.

* * *

ప్రాణాన్ని నిలిపే వృత్తే ఒక్కోసారి ప్రాణాంతకం కావడమే జీవితం! ●